క్లుప్తంగా

కాముడి దహనం



ఏటూరునాగారం: మండలంలోని ప్రజలు హోలీ పండుగ సందర్భంగా ఆడుతున్న జాజిరి ఆట గురువారం ముగిసింది. మహిళలు, చిన్న పెద్ద తేడా లేకుండా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, పల్లె పాటలను పాడుతూ అలరించారు. మర్వాడి సంఘం, రామాలయం ఆధ్వర్యంలో కాముడి దహనం కార్యక్రమాన్ని రామాలయం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు. శాస్త్రోత్తంగా పూజలు చేసి కాముడి దహనం చేసి రంగులు చల్లుకున్నారు. శుక్రవారం నిర్వహించే హోలీ వేడుకలకు ప్రజలు, యువకులు సిద్ధమయ్యారు.

రూ.18వేల వేతనం ప్రకటించాలి

ములుగు రూరల్: బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండెబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్‌సీ టార్గెట్ పేరుతో ఆశ కార్యకర్తలను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆశ వర్కర్ల కుటుంబాల సభ్యులందరికీ హెల్త్ కార్డులను అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు నీలాదేవి, చుంచు మంజుల, మాధవి, శ్రావ్య, రమాదేవి, సుధారాణి, శోభ, కవిత, ఆదిలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు గ్రామంలో గురువారం మండల పశు వైద్యాధికారిని శ్రీనిధి ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువులను పరీక్షించి యజమానులకు మందులను అందించారు. దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ శిబిరంలో కుమారస్వామి, అరుణ, కృష్ణ, రాంబాబు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వాహనాల తనిఖీ

కన్నాయిగూడెం: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఇద్దరికి గాయాలు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గురువారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామానికి చెందిన సునారి రవీందర్, భార్య పాపక్క ఇద్దరు దంపతులు ద్విచక్ర వాహనంపై మండలంలోని తిమ్మంపేటకు వెళ్తున్నారు. బోరునర్సారానికి చెందిన కాపుల జాన్‌పాల్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని మంగపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బోరునర్సాపురం వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

వెంకటాపురం(ఎం): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు సాంబలక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై జక్కుల సతీశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో సాంబలక్ష్మి ఆటోలో కడ్డీ మీద కూర్చొని వెళ్తుండగా కొండాపూర్‌కు చెందిన అభిషేక్ ద్విచక్రవాహనంతో ఆమెను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వలస కూలీ..

కన్నాయిగూడెం : జాగ్రత్తలు పాటించకుండా మిర్చి తోటలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న క్రమంలో అస్వస్థతకు గురైన ఓ వలస కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుర్రేవులలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అప్క రాకేశ్ (28) గుర్రేవులకు చెందిన రైతు మంచాల సంతోశ్ వద్దకు కూలీ పనికి వచ్చాడు. సంతోశ్ తన మిర్చి చేనులో సోమవారం రాకేశ్‌తో పురుగుల మందు పిచికారీ చేయించారు. పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో మందు రాకేశ్ శరీరంలోకి ప్రవేశించి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి కూలీలు, రైతు సంతోశ్.. వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు అప్క శుక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు



శివాపురంలో కొత్తరోడ్ల నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు



అల్లంవారిఘణపురంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- సద్వినియోగం చేసుకుంటున్న కూలీలు
- పనులకు 480 మంది హాజరు

ఏటూరునాగారం: మండలంలో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజుల పనులు కల్పించడంపై ఈజీఎస్ అధికారులు దృష్టి సారించారు. దీంతో వేసవికాలంలో ఎలాంటి పనులు లేని కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లి సద్వినియోగం చేసుకుంటున్నారు. కూలీలు ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం 480 మంది కూలీలు హాజరవుతున్నారు. పర్కులేషన్ ట్యాంక్‌లతో పాటు ఫాం పాండ్, కొత్తరోడ్లు, చెరువు శిఖం భూముల్లో ఫిష్ ఫండ్, గొర్ల పాకలు, నాడెమ్ కంపోస్ట్, ఇంకుడుగుంతలు వంటి పనులు నిర్వహిస్తున్నారు. అవేకాకుండా హార్టికల్చర్‌కు సంబంధించి జామ, మామిడి మొక్కల నాటడం, సంరక్షణ పనులు చేపడుతున్నారు. దీంతో ఉపాధిహామీ కూలీలకు ఎంతో దోహదపడుతుంది.

పనులకు రావాలి

జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్క కుటుంబం ఉపాధిహామీ పనులకు రావాలి. వారికి రోజువారిగా మస్టర్స్ వేయడం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సి ఉంటుంది. వేసవిలో జాగ్రత్తలను పాటించాలని కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం.

– చరణ్, ఈజీఎస్ ఏపీఓ ఏటూరునాగారం

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



హారతి చూపుతున్న పురోహితుడు

ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు దేవునిగుట్టపై గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. కొత్తూరు, రాయినిగూడెం, సర్వాపురం, అంకన్నగూడెం, కన్నాయిగూడెం, కాశిందేవిపేట, పంచోత్కులపల్లి, కాశిందేవిపేట, జంగాలపల్లి, దుబ్బగూడెం, జగ్గన్నగూడెం వంటి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పురోహితుడి రఘునందనాచార్యుల వేదమంత్రాల ఉచ్ఛరణలతో కల్యాణ మహోత్సవం కనులవిందుగా జరిపించారు. ఆలయ అభివృద్ధికి వీరంనేని రవీందర్‌రావు రూ.లక్షను విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు, వీరమనేని రవీందర్‌రావు, అక్కల సంపత్, అప్పని రాంబాబు, దొమ్మటి మల్లయ్య, మేడ చిన్నస్వామి, రెడ్డి గోపురాజ్‌కుమార్, సుదర్శన్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో తిరు కల్యాణానికి ఏర్పాట్లు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు(శుక్రవారం) నిర్వహించనున్న తిరు కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. తిరు కల్యాణ మహోత్సవ వేడుకలను తిలకించేందకు వెంకటాపురం, వాజేడు మండలాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణ వేడుకలను తిలకిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చలువ పందిల్లు, విద్యుత్ లైట్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు.

ప్రజాసమస్యలపై ఐక్యంగా పోరాడాలి



ఎస్పీ డాక్టర్ శబరీశ్‌తో షేక్‌గౌడ్, సభ్యులు

ములుగు: జిల్లాలో నూతనంగా నియామకమైన అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్(ఐహెచ్‌ఆర్సీ) కమిటీ సభ్యులు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్‌గౌస్ సూచించారు. జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న సమక్షంలో గురువారం ఎస్పీ డాక్టర్ శబరీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నిబంధనలకు లోబడి పనిచేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకన్నతో పాటు కమిటీ సభ్యులకు షేక్‌గౌడ్ ఐడీ కార్డులను అందించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే రాష్ట్ర కమిటీ తెలియజేయాలని అన్నారు. లీగల్ అడ్వైజర్ల సలహా మేరకు ముందుకుసాగాలని అన్నారు. సాధ్యమైనంత వరకు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధిత కుటుంబాలకు అండగా నిలిచే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూక్య సునీల్, జిల్లా కార్యదర్శులు కుదురుపాక రాజేష్, బానోత్ జవహర్‌లాల్, సహాయ కార్యదర్శి కెత్తె ఆనంద్(నందు), ఉపాధ్యక్షుడు కంచర్ల రాజు, జానుపట్ల జయరాజ్, కో కన్వీనర్ రుద్రబోయిన మల్లేష్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న రాంపతి

ఏటూరునాగారం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. యాసంగిలో నీటి ఎద్దడి ఎండ తీవ్రతలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈజీఎస్ పనుల వద్ద టెంట్, తాగు నీరు సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ కూలీలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలను తీసుకునే విధంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ, డీటీ రాహుల్, డాక్టర్ సుమలత, ఈజీఎస్ ఏపీఓ చరణ్ పాల్గొన్నారు.

మంగపేట: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా పరిశ్రమల కార్యాలయం మేనేజర్ సిద్ధార్థరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచకుని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు, వ్యవసాయ, ఉపాధిహామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ భద్రు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాకన్న, చుంచుపల్లి వైద్యాధికారి యమున, ఏఓ చేరాలు, ఎంఈఓ మేనక, ఎంపీఓ మమత తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అధికారులు పనిచేయాలి

కన్నాయిగూడెం: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేసవిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, డాక్టర్ గిరి, ఐలాపూర్, శరత్ బాబు పాల్గొన్నారు.

గ్రౌండ్ వాటర్ పథకం ద్వారా బోర్ వెల్స్

గోవిందరావుపేట: మండలంలోని రైతులకు గ్రౌండ్ వాటర్ పథకం ద్వారా రైతులకు బోర్ వెల్స్ సౌకర్యం కల్పించినట్లు మండల ప్రత్యేకాధికారి జయరాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గ్రౌండ్ వాటర్ పథకం ద్వారా ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ గిరిజనులకు రెండు ఎకరాలు, ఆ పైన పట్టా కలిగిన రైతులకు బోర్ వెల్స్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 20న గ్రామ సభలు నిర్వహించి అనంతరం తీర్మానం కాపీలను ఈ నెల 22న ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐటీడీఓ పీఓ ఏటూరునాగారం కార్యాలయంలో సమర్పించి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాబోవు వేసవిలో తాగు నీరు సరఫరా, ఉపాధిహామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అశోక్

మంగపేట: మండలంలో అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచించారు. మండల కేంద్రంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యతో కలిసి గురువారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో మండుతున్న ఎండల కారణంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు యానయ్య, వెంకటేశ్వర్లు, నరెందర్, నాగేంద్రబాబు, వైకుంఠం, నర్సయ్యగౌడ్, యాదగిరి, మల్లయ్య, సాంబిరెడ్డి, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం..

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తిరుపతి



మాట్లాడుతున్న తిరుపతి

ములుగు: దళితబంధు విషయంలో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి హెచ్చరించారు. బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకాన్ని ఆసరాగా చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దళితబంధుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికీ దళితుల పక్షాన నిలబడి ఉందనే విషయాన్ని ఎస్సీ సమాజికవర్గ ప్రజలు గమనించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవిమాదిగ, మాదారపు రాజు, కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న ప్రతాప్

వాజేడు: మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అధికారులను కోరారు. మండల పరిధిలోని ఘణపురం గ్రామంలో గురువారం గోండ్వానా సక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా ఏజెన్సీ ప్రాంతంలో బహుళ జాతి విత్తనాలను ఆదివాసీలకు అంట గట్టి నట్టేట ముంచారన్నారు. ఈ సమావేశంలో సురేష్, గోపాల్, నాగరాజు, నరేంద్ర, శివ కుమార్, లక్ష్మణ్, శ్రీను, గౌతమ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ శ్రీనువాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిత్యం సాధన చేసి విద్యార్థులకు బోధన చేస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు అనంతరామ్ పాల్గొన్నారు

పంటల సాగుపై క్షేత్ర ప్రదర్శన

మంగపేట: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాపుల యజమానులకు దేసీ శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ, కేఎస్ బయోసైన్స్ ఆధ్వర్యంలో ఆడ మగ వరి, ఆయిల్ పాం సాగుపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. క్షేత్రప్రదర్శన పాల్గొన్న వారికి పామ్‌ఆయిల్ సాగులో యజమాన్య పద్ధతులు, రైతులకు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సాయాన్ని ఉద్యాన శాఖ అధికారిని లావణ్య వివరించారు. ఆడమగ వరి పంట సాగులో మెలుకువలపై సంబంధిత ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేసీ ట్రెనింగ్ అధికారి బండి స్వామి, బేయర్ కంపనీ రీజినల్ మేనేజర్ రాజ్‌బార్, ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఉన్నారు.

కొలువుల సాధనలో రాజేశ్ భేష్




నియామక పత్రం అందుకుంటున్న రాజేశ్

ములుగు: కష్టపడి చదివి నాలుగు ఉద్యోగాలు సాధించాడు జిల్లాకు చెందిన సొల్లేటి రాజేష్. మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన సొల్లేటి పద్మ, వాసుదేవా రెడ్డి కుమరుడు రాజేశ్ 2024లో గురుకుల పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్‌గా ఒకే సంవత్సరంలో మూడు ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో గురుకుల డిగ్రీ అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల వెలువడిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో కెమిస్ట్రీ సబ్జెక్టులో మల్టీజోన్‌లో 12వ ర్యాంకు సాధించి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామకపత్రం అందుకున్నాడు. 1 నుంచి 10వ తరగతి వరకు చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో చదివిన రాజేశ్, ఇంటర్ ప్రైవేట్ కళాశాల ములుగు, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో, పీజీ శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్‌లో పూర్తి చేశాడు. కుటుంబసభ్యుల ప్రోత్సహంతోనే తాను ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నాడు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

గోవిందరావుపేట: ఇతరులకు ఇబ్బంది కలగకుండా హోలీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని పస్రా పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై జాగ్రత్తలు వహించాలని అన్నారు. మండల వ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు ఉంటాయని మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ఈత రాని వారు వాగులు, చెరువులకు వెళ్లవద్దని అన్నారు.

ఉచితంగా 'ఛావా' సినిమా ప్రదర్శన



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర సినిమా థియేటర్‌లో ప్రఖాండ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు జీవితం ఆధారంగా వచ్చిన ఛావా సినిమాను గురువారం స్థానిక డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా చూపించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. శంభాజీ మహారాజ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్



మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ రవిచందర్

ములుగు: రైతుల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగులో ఉన్న రైతుల చివరి పంట పొలాలకు నీటిని అందించేందు మంత్రి సీతక్క చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ పనులు పూర్తి చేసి ఇంచర్ల, కాశిందేవిపేట, జంగాలపల్లి రైతులకు న్యాయం జరిగే విధంగా భూసేకరణ చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారని వివరించారు. భూ సేకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అభినయ్‌చారి, అబ్బాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండ భిక్షపతి, రైతులు తిప్పారపు కిషన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెసా గ్రామసభలు నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న సమ్మయ్య

వాజేడు: గ్రౌండ్ వాటర్ పథకం ద్వారా బోర్లు వేసుకోవడానికి పెసా గ్రామ సభలను నిర్వహించాలని ఈ మేరకు తేదీలను ఖరారు చేయాలని కోరుతూ పెసా మొబిలైజర్స్ సంఘం మండల అధ్యక్షుడు సమ్మయ్య ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ విజయకు వినతిపత్రం అందజేశారు. గ్రౌండ్ వాటర్ స్కీమ్ ద్వారా గిరిజన రైతులు బోర్లు వేసుకోవడానికి అవకాశం వచ్చిందన్నారు. అందుకు గాను పెసా గ్రామ సభలను నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వెంకటేష్, రాజబాబు, జగదీశ్వరరావు, అనిల్ కుమార్, కిషోర్ ఉన్నారు.

ఆదివాసీలకే అధికశాతం కేటాయించాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఇందిరమ్మ ఇళ్లను అధిక శాతం ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తాటి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 తర్వత వలస వచ్చిన గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరును నిలుపుదల చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆదివాసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోడి గోపి, బోగ్గుల రాంబాబు, తాటి సుమన్ తదితరులు ఉన్నారు.